# వెలుగు చుక్కలు

ఆమె ప్లాటుఫారంమీద నుంచుని దీనంగా చూస్తూంది. చూపు మేరదూరంలో కలిసుని రైలుపట్టాలూ, దూరంగా అతి దూరంగా మిణుకు మిణుకుమని మెరిసే రైలులైను దీపాలూ, ఆకాశంలో వెలిగీ వెలగని నక్షత్రాలూ; ఎముకలుకొరికే చలి ... తలమీద ముసుగు ఎంత దగ్గిరగా లాక్కున్నా చలికి శరీరం గగుర్పొడుస్తూనేవుంది. రైలురాక కోసం క్షణాలు లెక్కపెడుతూంది. రైలొచ్చేటైము అయింది. ఎంత కన్నుపొడుచుకొన్నా ఏం కనిపించడం లేదు...హఠాత్తుగా చూసింది : దూరంగా వెలుగుచుక్క, దాని వెంట కటికచీకటీ...అతి వేగంగా ముందుకి వస్తూంది. ఇంజెను ఆమెను దాటి వెళ్ళింది.

ఆమె రైలుపెట్టెల్లోకి అతిఆత్రంగా చూస్తూంది. తలుపులు తెరుచుకొని దిగే ప్రయాణీకులు దిగుతున్నారు. వాళ్ళని దిగనియ్యకుండానే యెక్కేవారు ఎక్కేస్తున్నారు. చివరికి కనిపించింది నూకాలు. పాత్తిళ్ళలో చిన్నమూటలా యేదో పెట్టుకుని ఒకపెట్టెలోంచి దిగింది నూకాలు. పరుగెత్తుకుని నూకాలుదగ్గిరికి వెడదాం అనుకొంది, కాని అడుగు పడలేదు; కాళ్ళకింద భూమేలేదా అన్నట్లు వుంది. నూకాలు ఆమెఅవస్థఅంతా చూసింది. ఏమాత్రం తొణుకూ బెణుకూ లేకుండా ఆమెకేసి నడిచివచ్చింది.

"ఇంత తెల్లారుజామునే స్టేషనుకెందుకొచ్చారమ్మా,

ఇక్కడిదాకా వచ్చినదాన్ని ఇంటికి రానూ ?" అంది నూకాలు. కంఠస్వరంలో వణుకు ధ్వనించింది.

"సరేకాని నూకాలూ, వాడేడీ ? ఏమయింది అసలు ?" ఆతృంగా ప్రశ్నించింది ఆమె.

"వస్తానన్నారమ్మా, సులభంగా రావడానికే, యిదిగో యీపసిగుడ్డుని తీసుకొచ్చేశాను."

"ఏమన్నాడు నూకాలూ, ఎప్పుడొస్తానన్నాడు ?"

"ఆ అమ్మాయి చచ్చిపోయిందటమ్మా. చనిపోయే ముందే పెళ్ళిచేసుకొన్నారుట...యీగుడ్డుకి తల్లీతండ్రి ఎవరనే ప్రశ్న రాకుండా..." అంటూ నూకాలు ఆమెచేయి పుచ్చుకొని స్టేషనులోంచి అవతలకి దారితీసింది.

ఇద్దరూ ఇవతలి కొచ్చేసరికి సూర్యోదయం అవుతోంది. ఉదయభానుని కాంతి భూమికి వింతశోభ నిస్తూంది. జీవంతో తొణికిసలాడుతున్న ప్రశాంతత అంతటా ఆవరించి ఉంది. ఆలోచనలో మునిగి యెదుటి శూన్యంలోకి చూస్తూ వుండిపోయింది ఆమె.

గడచిన జీవితం అంతా మళ్ళీ ఒకసారి ఆమె మనస్సులో మెదిలింది. ఆమె హృదయానికి దగ్గిరగావున్న పసివాడి చిరుచేతులు మేలుకొలుపులు పాడాయి. గడచిన ఘట్టాలు ఒకదానివెంట ఒకటి ఆమె మనోనేత్రంముందు కదలసాగేయి. పసివాడిమీద కప్పిన కప్పు తొలగించింది... చలిగాలి తాకీ, వెలుగు సోకీ, పసివాడు కళ్ళు తెరిచి పెదవులు కదిపాడు. ఆనందంతో గట్టిగా హృదయానికి హత్తు

కొంది. ఇది చూసిన నూకాలు సంతోషించినా "ఇలా యియ్యండమ్మా, అనవసరంగా యేడిపిస్తారు" అంటూ తనే తీసుకొంది. మాటకందని తన ఊహాలకి సమాధానం యిచ్చేసేమో! అనుకొంది. ఆమె దీర్ఘంగా నిట్టూర్చి కళ్ళు మూసింది.

*　　*　　*

జీవితం కేవలం కంటకప్రాయం కాదు, కేవల సుఖ సాగరం కాదు. అది మాటలలో చెప్పలేని ఒక సత్యం. ఆమె గడచిన జీవితం నెమరు వేసుకొంటే నిజంగానే జీవితం మాటలకందని ఒక సత్యమే అనిపించింది.

తండ్రి ఐశ్వర్యం ధర్మమా అంటూ పట్టణంలో హాస్టల్లో వుండి చదువుకొనే యోగ్యత పట్టింది. అబ్బ! పరీక్షలు రాసి తిరిగి యింటికి వచ్చే రోజు కోసం ఎలా ఎదురు చూసింది తను? ఇంటిదగ్గిర యేముందనో! ఆ రోజు నాన్న వచ్చి యింటికి తీసుకువస్తే ప్రాణం హాయిమనిపించింది. ఇంటికి వచ్చినదగ్గరనుంచీ అమ్మకి ఒకటే ఆలోచన. పెళ్ళి. తనకూతురికి ఘనంగా పెళ్ళి చెయ్యాలి. అందమైన అల్లుడు రావాలి. అనసూయ హాయిగా వుండాలి. అస్తమానం ఇదే. ఆవిడ కోరిక ప్రకారమే జరిగింది. అతన్ని తొలిరోజున చూసినప్పుడు తనెంత ముగ్ధురాలైందని! నిజంగా తన అదృష్టం అనుకొంది. పెళ్ళి అయిపోయింది. ఇచ్చిన కట్నం కాక, అమ్మ తన పేరకూడా కొంతధనం యిచ్చింది. జీవితం యిక సుఖసాగరమే అని తలపోసింది. "అనూ, నువ్వే నా

జీవితానికి వెలుగువి, నువ్వే నాకు మనశ్శాంతివి" అని కృష్ణమూర్తి తనని హృదయానికి చేర్చుకొన్నప్పుడు, అలాగే చచ్చిపోయినా చింత లేదనిపించేది. నిజంగా అంత ప్రేమించే భర్త వున్నాక జీవితంలో యింకేంలోటు ?

* * *

సంవత్సరాలు గడిచాయి. తను మాతృదేవిఅయింది. రామూ రోజురోజూ యెదుగుతున్నాడు. అప్పట్లో రామూయే తన జీవిత సర్వస్వం. కృష్ణమూర్తిలో తను ఎప్పుడూ ఊహించనైనా లేనిమార్పులు ఒచ్చాయి. తనంటే యెంత నిర్లక్ష్యం ? ఎప్పుడూ యింట్లో వుండేవాడు కాదు. వున్నా ఏదో ఒకదానికోసం పెద్ద దెబ్బలాట. తనమూలంగా అతని జీవితంలో వికాసం లేకుండాపోయిందట. ఎంత అన్యాయం ! మొదట్లో యీ కృష్ణమూర్తికే తను వెలుగూ మనశ్శాంతి అయిందే !

రోజులు అలా గడిచినా బాగుండేది. కాని అలానూ జరగలేదు. అనుకోకుండానే మృత్యువువాతపడ్డాడు కృష్ణమూర్తి. మత్తుగా తాగి నదిలోపడి మరణించాడు. పైగా, తన మనశ్శాంతి పోవడానికి కారణం యిల్లేనని రాసిపెట్టి మరీ అతను జీవితం ముగించుకొన్నాడు. తనా కారణం ? తనేం చేసిందని ? కావలిస్తే కృష్ణమూర్తి మరో భార్యను తెచ్చుకొన్నా తను వద్దంటుందా ? జీవితంలో ఒక ఘట్టం ముగిసిందనుకొంది, కొడుకేనా తనని ఉద్ధరిస్తాడని కలలు కంటూ. ఉన్న ఆస్తిని కొంచెం కొంచెంగా కరిగించి వాడికి

చదువు చెప్పించింది. కాని రామూ కూడా తండ్రికి కొడుకే అనిపించుకొన్నాడు. తల్లి హృదయంలో చిచ్చు పెట్టడే కాని మనశ్శాంతి నివ్వలేదు.

చదువుకోసం పట్టణంలో బస వెలిగించిన రామూ ఒక పిల్లజమీందారుగా చెలామణీ అయ్యాడు. డబ్బు అధికంగా వ్యయంచేశాడు. తల్లి అష్టకష్టాలూపడి డబ్బు పంపుతూంటే, అది తన ఎస్టేటు ఆదాయంగా యెంచి హాయిగా ఖర్చుపెట్టేవాడు. సెలవల్లోకూడా తల్లిని చూడ్డానికి రాలేదు సరికదా, అప్పులవాళ్ళనిమాత్రం యింటికి పంపేవాడు. ఎన్నాళ్ళయిందో కొడుకుని చూసి. రమ్మని, రాసినా రానూలేదు; ఉత్తరానికి సమాధానమూ రాయలేదు. ఒకరోజు తెగించి తనే కొడుకుని చూడ్డానికి పట్నం వెళ్ళింది. కాని అక్కడ ఉంటేగా? చాల రోజులక్రిందటే ఒక అమ్మాయితో సహా వూరువిడిచి వెళ్ళిపోయాడుట. ఎంత అప్రతిష్ఠ! తన కొడుకేనా అలా చేశాడు? అనుకొంది. అవును, తన కొడుకు కనకనే అలా చేశాడు. తన భర్త యింతకంటె ఎక్కువ ఏంచేశాడు కనక!

రెండు మూడు సంవత్సరాలపాటు కొడుకు జాడ తెలియలేదు. హఠాత్తుగా ఒకరోజున ఉత్తరం వచ్చింది. ఇబ్బందులలో వున్నాననీ, డబ్బు పంపితే తనూ, ఆ అమ్మాయీ, వస్తామనీ రాశాడు. కోపంతో తనకి ఒళ్ళు తెలియలేదు. దౌర్భాగ్యుడు ఏమని రాశాడు తనకి! కష్టాలలో వుంటేగాని కన్నతల్లి కనిపించదు కాబోలు. ఒక్క కానీ కూడా పంపకూడదని నిశ్చయించుకుంది. కాని ఎలాగ?

ఎలాగ పంపకుండా వుండడం? తన రక్తాన్ని పంచుకు పుట్టిన రామూ కష్టాలు తనవి కావూ? దృఢనిశ్చయం కాస్తా సడలిపోయింది. డబ్బుపంపి రమ్మని రాసింది - అతనొక్కడికీ. ఎన్ని కష్టాలకో ఓర్చిన తను ఆ అమ్మాయిని మటుకు ఎందుకు భరించలేదు? తన కొడుకు చేసినపని సంప్రదాయానికి విరుద్ధం. అందుకే తను భరించలేదు. ఇంత జరిగాక యింకా సంప్రదాయాలేమిటి - తన పిచ్చిగాని. అయినా, తాను ఒప్పుకోలేకపోయింది. అందుకే కొడుకూ రాలేదు.

మాట్లాడుకుందుకేనా ఎవరూ లేరు తనకి. ఈ నూకాలూ తనలాంటిదే. అందుకే తననే అంటిపెట్టుకొని వుంది. కష్టసుఖాలకి అతీతంగా ప్రవర్తించగలదు నూకాలు. దాన్ని చూస్తే తనకీ నిబ్బరం కలుగుతుంది. తనెవరో, యీ నూకాలు ఎవరో! ఏ బాంధవ్యం లేకున్నా తన కష్టసుఖాలని దాని గుండెలో దాచుకోగలిగింది.

మానవాళి కష్టాలలో మగ్గుతోందని కాలం దొర్లడం మానేసుందా? రోజులూ నెలలూ గడుస్తూనే వుంటాయి.

...ఆరోజు తనకి ఒంట్లో బాగులేదు. రామూ దగ్గిర నుంచి వుత్తరం వచ్చింది. తన భార్య చనిపోతూవుందనీ, చివరిసారిగా తననీ ఆమెనీ క్షమించి ఒక్కసారి రమ్మనీ రాశాడు. అవును. తను మాతృదేవి కనక క్షమించాలి. అందుకని చూసిరమ్మని నూకాలుని పంపింది. నూకాలువచ్చి ఏ వార్త చెప్తుందో అని ఆ రోజు రోజంతా వేయికళ్ళతో యెదురుచూసింది. రాత్రంతా కన్నుమూసినా తెరిచినా తన గడచిన గాథే కనుకొలకులలో మెలిగింది.

జీవితంలో సుఖదుఃఖాలని సమంగా తను అనుభవించింది. అందుకే సుఖదుఃఖాల మిళితమే జీవితం అని చెప్పుకోగల్గింది. రాత్రంతా ఆ వేదనతో హృదయం తల్లడిల్లింది. రైలు రావడానికి యింకా చాలా వ్యవధి వుండగానే బండి కట్టుకొని స్టేషనుకి వచ్చింది—నూకాలు వస్తుందని. చలిగాలికి దేహం కొయ్యబారుతూంటే, హృదయం తీరని వ్యథతో మరిగిపోతూంటే రైలురాకకోసం, ఎదురుచూసింది. చూపుమేరదూరంలో కలియని రైలుపట్టాలూ, దూరంగా అతిదూరంగా మిణుకు మిణుకుమనే రైలు లైను దీపాలూ, కాంతివిహీనం అవుతున్న నక్షత్రాలూ, ఎముకలు కొరికే చలిగాలీ అన్నీ యేకమయి నూకాలువడిలోని పసికందులో లీనమయిపోయాయి. వీడేనాతన జీవితానికి శాంతి తేగలడేమో! వీడేనా తన హృదయానికి ప్రశాంతత చేకూరుస్తాడేమో! ఏమో! తన భర్త, ప్రేమించి లాలించి తనని మైమరపించిన తన భర్తా, తన జీవితంలో మెరుపను కొన్న చిన్న రామూ యివ్వలేని మనశ్శాంతి, యీ పసికందు యిస్తాడా? యివ్వగలడా?

...నవ్వుకొంది ఆమె.

ఆ నవ్వు విన్న నూకాలు తెల్లబోయిచూస్తూ—"మనవణ్ణిచూస్తే అంత నవ్వొస్తోందేమిటమ్మా? మరిమూడు, వాడెంతవాడౌతాడో" అంటూ, పసివాణ్ణి గుండెల కద్దుకొంది.

"అవును నూకాలూ, వాడెంతవాడౌతాడో!" నిస్స్పృహగా నవ్వింది ఆమె.